క్లుప్తంగా

కొనుగోళ్లు త్వరగా చేపట్టాలని మంత్రికి వినతి



మంత్రి గంగులతో రవీందర్‌రావు

బోయినపల్లి: మండలంలో ధాన్యం కొనుగోళ్లు త్వరగా జరిగేలా చూడాలని రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్‌ను రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో మండల బీఆర్‌ఎస్‌ నాయకులు కోరారు. బుధవారం మంత్రిని కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, వైస్‌ఎంపీపీ నాగయ్య, ఏఎంసీ చైర్మన్‌ లెంకల సత్యనారాయణరెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, చిందం రమేశ్, గుంటి శంకర్, గుడి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: మంత్రి కేటీఆర్‌ దత్తత గ్రామమైన మండలంలోని రాజన్నపేటకు రూ.2 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ గ్రామస్తులు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం చేశారు. మంత్రి ఇటీవల గ్రామంలో పర్యటించి మిగిలిన పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చిన 10 రోజుల్లో మంజూరు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ ముక్క శంకర్‌ మాట్లాడుతూ గ్రామానికి 32 డబుల్‌ బెడ్రూం ఇళ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి రూ.50 లక్షలు, మహిళల ఉపాధి కోసం 90 కుట్టు మిషన్లు మంజూరు చేశారన్నారు. ఉపసర్పంచ్‌ వెంకటరమణరెడ్డి,వార్డు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కరపత్రం విడుదల



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట: స్థానిక అంబేడ్కర్‌ విగ్రహం వద్ద మే 1న దళితుల ఆత్మగౌరవ పోరాటం నిర్వహించనున్నట్లు తెలంగాణ దళిత సంఘాల జేఏసీ మానకొండూర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి సావనపెల్లి రాకేశ్‌ అన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను బుధవారం విడుదల చేసి మాట్లాడారు. రాష్ట్ర సాధనోద్యమంలో కీలక పాత్ర పోషించిన దళితులకు కేసీఆర్‌ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దళితులను మోసం చేస్తున్నారన్నారు. మానకొండూర్‌ నియోజకవర్గంలో పాలకులు చేస్తున్న కుట్ర రాజకీయాలకు దళిత ప్రజాప్రతినిధులు, నాయకులు బలికావడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మండల అంబేడ్కర్‌ సంఘం అధ్యక్షుడు తడ్కపెల్లి భూమయ్య, నాయకులు పాల్గొన్నారు.

అమ్ముకునే వేళ.. ఆగమాగం

సిరిసిల్లఅర్బన్‌/చందుర్తి: ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్ముకునే వేళ అకాల వర్షం రైతన్న ఆగం చేసింది. పండించిన పంట కళ్ల ముందే నీట మునగడంతో రైతన్నలు మౌనంగా రోదిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి తూకం వేయకపోవడంతో ధాన్యం రాశులు పెరిగిపోయాయి. వర్ష సూచన ఉందని, వెంటవెంటనే తూకం వేయాలని రైతులు ఎంత మొత్తుకున్న వినలేదు. చివరికి అకాల వర్షం నిండా ముంచింది. వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఒక వడ్ల గింజ కూడా మిగిలిపోకుండా రాలిపోయాయి. వరుసగా ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతకు చివరకు కన్నీళ్లు మిగిల్చాయి. వరి సాగు రైతులు తాలు, మెడ విరుపుతో మూడు, నాలుగుసార్లు పురుగు మందులు పిచికారీ చేసి పంటను కాపాడుకుంటే చివరకు అకాల వర్షాలు వచ్చి పంటను ఊడ్చేశాయి. ఇంకో వారం, పది రోజులు కోతకు వచ్చి చేతికందే ధాన్యం కళ్ల ముందరే వడగళ్ల వానకు కొంత, ఈదురుగాలులతో కూడిన వర్షంతో మరికొంత నేలరాలి పోవడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నష్టపోయిన పంటలను పరిశీలించి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికను పంపించాల్సిన వ్యవసాయాధికారులు పొలం గట్లపై నుంచే పది, ఇరువై శాతమే నష్టం వాటిల్లిందంటూ రాసుకుంటున్నారు. దీంతో రెక్కల కష్టం నేలపాలైందంటూ బోరున విలపిస్తున్నారు.

- కన్నీళ్లు మిగిల్చిన అకాల వర్షం
- కోస్తే మిషన్‌ డబ్బులు కూడా దండగే
- తడిసి ముద్దయిన ధాన్యంతో పడిగాపులు
- ఇంకా ప్రారంభం కాని కొనుగోళ్లు
- మరోవైపు పంట నష్టం అంచనాపై అధికారుల పట్టింపులేనితనం
- మౌనంగా రోదిస్తున్న అన్నదాతలు



అకాల వర్షానికి దెబ్బతిని వరిగడ్డి కనిపిస్తున్న వరి పొలాలు

సాగునీటికి ఇబ్బంది లేకపోవడంతో అత్యధికంగా రైతులు వరి సాగును ఎంచుకున్నారు. వానకాలం పంట కన్నా యాసంగి వరి సాగు అధికంగా దిగుబడి వస్తుందన్న ఆశతో సాగు చేస్తే చేతికందే ముందు అకాల వర్షాలు పంటను మింగేశాయి. చందుర్తి మండలంలో 5 వేల ఎకరాలకు పైగా వరి పొలాల్లో వడ్లు రాలి పోయాయి. వీటిని కోత కోస్తే కనీసం మిషన్‌ ఖర్చులు కూడా చేతికందని పరిస్థితే ఉంది.

కేంద్రాలు ప్రారంభించి.. తూకం మరిచారు


దాదాపు 20 రోజుల క్రితం నుంచే వరి కోతలు ప్రారంభమయ్యాయి. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతన్నలు డిమాండ్‌ చేయడంతో ఐదు రోజులు క్రితం సెంటర్లను ప్రారంభించారు. కానీ తూకం మాత్రం పెట్టలేదు. దీంతో రైతులు ధాన్యంతో కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. కొనుగోళ్లు ప్రారంభించి ఉంటే తాము నష్టపోయేవారం కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవని, టార్పాలిన్లు కూడా ఇవ్వడం లేదంటున్నారు. ఇంత వరకు సెంటర్లకు గన్నీ సంచులు కూడా రాలేదని అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

పంట నష్టం అంచనా పైపైనే..

ఈదురు గాలులకు, వడగళ్లతో వడ్ల గింజలు రాలిపోయాయని రైతుల ఆవేదనకు పాలకులు స్పందించారు. సర్వే చేసి పంట నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయాధికారులు గ్రామాల్లో సంచరిస్తూ పంటలను పైపైనే పరిశీలిస్తున్నారు. 33 శాతం గింజలు రాలిపోతే పరిహారాన్ని ఇస్తామంటూ రైతులకు చెబుతునే, మరోవైపు అంత నష్టం లేదంటూ దాటవేస్తున్నారు. రైతులు ప్రశ్నిస్తే మెడ విరుపు, పురుగుతో గింజలు రాలి పోయాయంటూ వ్యవసాయాధికారులు బదులిస్తూ రైతులు నోళ్లు మూయిస్తున్నారు.

వెంటాడుతున్న వాన గండం

వాతావరణ శాఖ మరో నాలుగు రోజుల పాటు వర్ష సూచన ఉందన్న ప్రచారంతో రైతులు మరింత కుంగిపోతున్నారు. ఇంకా వర్షాలు పడితే రైతులు సాగు చేసిన నువ్వు, మొక్కజొన్న పంటలు కూడా చేతికి వచ్చే ఆవకాశాలు లేవంటూ ఆందోళన చెందుతున్నారు. మిగిలిన కొద్ది పంట గింజలను కోయించేందుకు కూడా వీలులేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోత కోయించేందుకు ఆరబెట్టిన వరి పొలాల్లో ఐదు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పొలం మడుల్లో వర్షం నీరు నిలిచి కోత వచ్చి పొలాలన్నీ కూడా కోయకుండా చేస్తోంది. వర్షాలతో సగానికి పైగా వడ్లు రాలిపోయిన మిగిలిన వాటితో పెట్టుబడి ఖర్చులైనా చేతికి వస్తాయని కొందరు రైతులు ఆశ పడుతున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో వడ్ల కుప్పలను రక్షించుకునేందుకు నానా తంటాలు పాడాల్సి వస్తోంది.



తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు



రాలిన వరి గింజలు



తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

కాంటాలు ప్రారంభించాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేవలం పేరుకే మాత్రం ప్రారంభించారు. కానీ ధాన్యాన్ని తూకం వేయడం లేదు. ధాన్యం రాశులు పెరుగుతున్నాయి. రెండు మూడు రోజులు నుంచి వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. వర్షం పడితే చేతికొచ్చిన పంట నీటి పాలువుతుంది.

– ఉలిచే రాములు, రైతు

మొగులు చూస్తే భయమేస్తోంది



ధాన్యాన్ని తూకం వేస్తలేరు. కాంటా ఎప్పుడు పెడుతారో తెలియడం లేదు. 10 రోజుల నుంచి కొనుగోలు కేంద్రాల్లోనే వేచి చూస్తున్నాం. మొగులు చూస్తే భయం వేస్తోంది. ధాన్యంపై పరదాలు కప్పినా కూడా కింద నుంచి నీరు వెళ్లి తడిసి ముద్దవుతుంది. మళ్లీ ఆరబెడుతున్నాం. వర్షం పడినప్పుడల్లా ఇదే పరిస్థితి ఉంటుంది. తొందరగా వడ్లు కొనాలి.

– అయిలి పోశెట్టి, రైతు పెద్దూరు

ఒక్క గింజ మిగల్లేదు



మూడెకరాల్లో వరి సాగు చేసిన. ఇందులో ఎకన్నర పొలంలో 1010 రకం వరి వేయగా, మరో ఎకరంన్నరలో వరి సాగు చేశా. 1010 రకం ఐదు రోజుల కురుస్తున్న వర్షాలకు గింజలన్నీ రాలిపోయి పొలంలో గడ్డి మిగిలింది. ఆ పొలం కోసిన కోత మిషన్‌ డబ్బులు కూడా చేతికందవు. మిగిలిన ఎకన్నరంలో సగానికిపైగా వడ్ల గింజలు రాలి పోయినవి. వ్యవసాయాధికారులు చూపించిన నష్టం జరుగలేదంటున్నారు.

– పల్లపు రాజయ్య, రైతు, బండపల్లి

పరిహారం చెల్లించాలి



రెండెకరాలన్నర ఎకరాల్లో వరి పొలం వేశా. మరో వారం రోజుల్లో కోతకు వచ్చేది. వర్షాలకు పొలం దెబ్బతింది. వడ్ల గింజలన్నీ రాలిపోయాయి. కనీసం పెట్టుబడులు కూడా చేతికి వచ్చే అవకాశం లేదు. గతేడాది కంటే ఈ ఏడాది పెట్టుబడి ఖర్చులు మూడింతలు పెరిగాయి. తడిసి మోపెడైనా ఖర్చులకు తోడు అకాల వర్షాలతో పంట పూర్తిగా నష్టపోయాం. పంట సర్వే చేసి నష్ట పరిహారాన్ని అందించాలి.

– ముంజేడ సాగర్, రైతు, కిష్టంపేట

నివేదిక పంపించాం



అకాల వర్షాలతో దెబ్బతిన్న వరి పొలాలను సర్వే చేసి నష్టపోయిన రైతులు వివరాలను ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నాం. రెండు రోజులుగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఏఈవోలు పంట నష్టాన్ని సర్వే చేస్తున్నారు. మండలంలో 110 ఎకరాల్లో ప్రాథమిక అంచనాల నివేదికను సోమవారం ప్రభుత్వానికి పంపించాం. బుధవారం 650 ఎకరాల్లో నష్టపోయిన పంటల నివేదికను పంపించాం.

– ప్రణీత, ఇన్‌చార్జి వ్యవసాయాధికారిణి, చందుర్తి

కొనుగోలు కేంద్రాలతోనే మద్దతు ధర

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే

కోనరావుపేట: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో ఐకేపీ, సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో దళారుల బారి నుంచి రైతులను కాపాడేందుకు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు ఈ కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం నిమ్మపల్లిలో అకాల వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలించారు. బాధిత రైతులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్‌ న్యాలకొండ అరుణ, ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, సర్పంచులు కదిరె శ్రీనివాస్, ఇస్లావత్‌ రాములునాయక్, సర్పంచుల ఫోరం కన్వీనర్‌ గోపు పర్శయ్య, తహసీల్దార్‌ రవికాంత్, ఉపసర్పంచ్‌ దొంతరవేణి శ్రీనివాస్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్‌ బండ నర్సయ్య, వైస్‌ చైర్మన్‌ అనుపాటి భూంరెడ్డి, ఏవో వెంకట్రామమ్మ, ఏపీఎం దేవరాజు, బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలనలో వ్యవసాయ శాఖ



బోయినపల్లి వరి చేలో ఏడీఏ భాస్కర్‌

బోయినపల్లి: మండలంలోలని తడగొండ, బోయినపల్లి, కోరెం గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న పంటలను బుధవారం వేములవాడ ఏడీఏ భాస్కర్, ఏరువాకకేంద్రం శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్‌లు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఉపసర్పంచు పిట్టల మోహన్, ఏఈవోలు శ్రీదేవి, సాహితి ఉన్నారు.

వేములవాడరూరల్‌: మండలంలోని నమిలిగుండుపల్లి, వట్టెంల, ఫాజుల్‌నగర్, నూకలమర్రి, ఎదురుగట్ల తదితర గ్రామాల్లో వడగళ్ల వానతో తీవ్రంగా నష్టపోయిన పంటను వ్యవసాయ అధికారులు, పార్టీల అధికారులు పరిశీలించి రైతులతో మాట్లాడారు.

సిరిసిల్లఅర్బన్‌: అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను ఎమ్మార్వో విజయ్‌కుమార్‌తో పాటు వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. సిరిసిల్లలో ప్రాథమిక అంచనా ప్రకారం దాదాపు 248 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ఏవో తెలిపారు. స్థానిక కౌన్సిలర్‌ లింగంపల్లి సత్యనారాయణ, ఏఈవో వైష్ణవి ఉన్నారు. పెద్దూరులోని గౌడ సంఘం కల్లు దుకాణం వద్ద రేకుల షెడ్డు కూలిపోగా బీఆర్‌ఎస్‌ రాష్ట్ర సీనియర్‌ నాయకుడు చీటి నర్సింగరావు పరిశీలించారు.

పవర్‌ కట్‌

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లఅర్బన్‌: సిరిసిల్ల పట్టణంలోని శివనగర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో 11 కేవీ విద్యుత్‌ లైన్‌ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే పనులు ఉన్నందున గురువారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్‌ ఏఈ మధుకర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయినగర్, కొత్తబస్టాండ్, బీవైనగర్, గోపాల్‌నగర్, గణేశ్‌నగర్, ఇందిరానగర్, శివనగర్, ఆదర్శనగర్, వెంట్రావునగర్, సుభాష్‌నగర్, నెహ్రూనగర్‌ తదితర ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలి

- కాంగ్రెస్‌ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న సత్యం

బోయినపల్లి: వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలకు ఎకరాన రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం డిమాండ్‌ చేశారు. మండలంలోని అనంతపల్లి గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి వర్షాలకు దెబ్బతిన్న పంటలను బుధవారం పరిశీలించి మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. నెల క్రితం సీఎం కేసీఆర్‌ రామడుగు మండలంలో దెబ్బతిన్న పంటను పరిశీలించి ఎకరాకు రూ.10 వేలు ఇస్తానని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కొర్రీలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ పులి లక్ష్మిపతి, నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసమే దళితశక్తి పోరాటం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముస్తాబాద్‌: ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యున్నతి, రాజ్యాధికారం కోసం దళితశక్తి ప్రోగ్రాం అధ్యక్షుడు విశారదన్‌ మహారాజ్‌ తలపెట్టిన పదివేల కిలోమీటర్ల మహాపాదయాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలని డీఎస్‌పీ దీపారాధన కమిటీ కన్వీనర్‌ కేసుగాని పరమేశ్వరి కోరారు. ముస్తాబాద్‌లో విశారదన్‌ మహారాజ్‌ ముగింపు బహిరంగ సభ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. పాదయాత్ర ముగింపు సభ హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌ మైదానంలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రేవతి,పోచవ్వ, నర్సవ్వ, బాబాయి, కనకవ్వ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత ఆక్రందన



ముస్తాబాద్‌: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ప్రకృతి ప్రకోపానికి కొట్టుకుపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. ముస్తాబాద్, పోతుగల్, గూడెం, గూడూరు, నామాపూర్, ఆవునూర్‌ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బుధవారం రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి వసతులు లేకపోవడం, టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో నోటి కాడి ముద్ద కాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క పోతుగల్‌ మార్కెట్‌ యార్డులోనే వంద క్వింటాళ్ల ధాన్యం నీటిలో తడిసిపోయిందన్నారు.

నియామకం

బీజేపీ మండల కార్యవర్గం

ఇల్లంతకుంట: మండల బీజేపీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్‌ తెలిపారు. ఉపాధ్యక్షులుగా గుంటి మహేష్, భూమల్ల ప్రశాంత్, పయ్యావుల ఎల్లయ్య, కామల్ల ఎల్లయ్య, కాట్నపెల్లి రవిందర్‌రెడ్డి, బోయిని రంజిత్, ప్రధానకార్యదర్శులుగా తిప్పారపు శ్రావణ్, సింగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, కార్యదర్శులుగా అక్కెం మధు, పల్లె సాయిప్రసాద్‌రెడ్డి, పయ్యావుల బాలయ్య, దుబ్బ అరవింద్, జెట్టి యశ్వంత్, నల్లవేణి ఎల్లయ్య, కోశాధికారి దూడం కిషోర్‌ ఎన్నికయ్యారు.

ఆర్థికసాయం

వీర్నపల్లి: మండలంలోని భూక్య తండాలో భూక్య శీలకు చెందిన రేకుల షెడ్డు మంగళవారం కురిసిన ఈదురు గాలికి లేచిపోవడంతో తక్షణసాయం కింద రూ.3,200 తోపాటు, 10 కిలోల బియ్యం అందజేసినట్లు ఆర్‌ఐ ప్రవీణ్‌ కుమార్‌ తెలిపారు.

ధాన్యం తూకం వేయాలి

ఇల్లంతకుంట: మండలంలోని గ్రామాల్లో పేరుకు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని, ఇప్పటి వరకు ఒక గింజ కూడా తూకం వేయలేదని బీజేపీ దళిత మోర్చా మండల ప్రధాన కార్యదర్శి మామిడి హరీశ్‌ ఒక ప్రకటనలో ఆరోపించారు.

సిరిసిల్లఅర్బన్‌: అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ కిసాన్‌ మోర్చా పట్టణాధ్యక్షుడు సుంకరి బాలకిషన్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.

ముస్తాబాద్‌: మండలంలో ఆకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కోల కృష్ణ, కిసాన్‌ సెల్‌ మండల అధ్యక్షుడు వరి వెంకటేశ్‌ కోరారు.

మహిళా కౌన్సిలర్‌ దాతృత్వం

సిరిసిల్లటౌన్‌: వేసవి కాలం నీటి ఎద్దడి తీర్చడానికి మహిళా కౌన్సిలర్‌ దాతృత్వాన్ని కనబరిచింది. సొంత ఖర్చులతో బోరుబావిని తవ్వించింది. పట్టణంలోని 34వ వార్డులో నీటి సమస్య ఉంది. ఎండాకాలం కావడంతో ప్రజల కోసం బోరు బావిని తవ్వించింది. ×గిఫ్ట్‌ ఏ స్మైల్‌× స్ఫూర్తితో సేవా కార్యక్రమం చేపట్టినట్లు కౌన్సిలర్‌ దార్ల కీర్తన–సందీప్‌ వివరించారు.

రైతులను ఆదుకోవాలి

వీర్నపల్లి: పంట నష్టపోయిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఒక ఎకరానికి రూ.50 వేల పరిహారం వెంటనే ప్రకటించి రైతులను ఆదుకోవాలని ప్రజాసంఘాల నాయకుడు అరుణ్‌ కుమార్‌ డిమాండ్‌ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక రైతులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళన చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో నాయకులు కాంతయ్య, మల్లేశం, మనోజ్, రాజం, దేవయ్య, శంకర్, తిరుపతి, సంజీవ్‌ పాల్గొన్నారు.

అలరించిన ఉత్సవాలు



జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుడిబుడి అడుగులతో చిన్నారుల చేసిన డ్యాన్సులు ఆహుతులను అలరించాయి. - సాక్షి నెట్‌వర్క్‌

ప్రమాణ స్వీకారం



సిరిసిల్లఅర్బన్‌: విశ్వబ్రాహ్మణ వేద పురోహిత సంఘం పాలకవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణలో జరిగింది. అధ్యక్షుడిగా రాజూరి సద్గుణాచారి, ప్రధాన కార్యదర్శిగా చందనగిరి రాజప్రకాశ్‌శాస్త్రీ, కోశాధికారిగా రాగి దేవేంద్రం ఆచార్యులు, ఉపాధ్యక్షుడిగా పుప్పాల దేవయ్య, గౌరవ అధ్యక్షుడిగా చిలుముల సుగుణాచారి, రాజూరి జనార్దనాచారి, ముఖ్య సలహాదారులుగా అల్వాల పుండరీకాచారి, వరహాల శ్రీనివాసాచారి, కాసర్ల మనోహరాచారి ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా విశ్వబ్రాహ్మణులు గౌరవ అధ్యక్షుడు చిలుముల సుగుణాచారి, జనార్దనాచార్లి, బ్రహ్మచారి, కృష్ణమూర్తిచారి, రమేశాచారి, శంకర్, వేణుగోపాలాచారి, రవీందర్‌చారి, ప్రవీణ్‌చారి, రవీంద్రాచారి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా: 9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్‌ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899